



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

# సింగీతం శ్రీనివాసరావు

## (1989, జనవరి విజయచిత్ర నుంచీ పునర్ముద్రణ)



కొత్త శీర్షిక:

జయాపజయాలు

—సింగీతం శ్రీనివాసరావు

చలనచిత్ర రూపకల్పనలో అత్యంత ప్రధానమైన పాత్ర వహించే వ్యక్తి – దర్శకుడు. సాధారణంగా దర్శకుల మేధా సంపత్తి, కృషి విధానాల్లో లోపం లేకపోయినా, వారు తీసిన చిత్రాల్లో కొన్ని విజయవంతమవుతాయి. మరికొన్ని పరాజయాన్ని పొందుతాయి. అలా 'తమ చిత్రాల్లో ఘన విజయం సాధించిన ఒక చిత్రం ఏయే అంశాలవల్ల విశేష ప్రజాదరణ చూరగొన గలిగింది? అపజయం పొందిన చిత్రం ఎందువల్ల అలా రూపొందింది?' అన్న విషయాన్ని చర్చిస్తూ, దర్శకులు తమ భావాలను వ్యక్తం చేయడానికి ఉద్దేశించిన శీర్షిక యిది. 'జయాపజయాలు' గురించి ప్రముఖ దర్శకులు సింగీతం శ్రీనివాసరావు చెప్పిన అనుభవాలతో ఈ శీర్షికను ప్రారంభిస్తున్నాము.

సినిమాల్లో—'జయాపజయాలు' అనుకున్నప్పుడల్లా ఎప్పుడో చాలా కాలం క్రిందట కీ॥ శే॥ పింగళి నాగేంద్రరావుగారు చెప్పిన సంఘటన గుర్తుకొస్తూ వుంటుంది.

ఒక నిర్మాత చిత్రం పూర్తి చేసిన తర్వాత 'ఎంబ్లెమ్'లో ఒక 'ఆర్చ్'లో రాయించడానికి 'సత్యమేవ జయతే, ధర్మమేవ జయతే' అనే పద్ధతిలో దేవుడికీ, సినిమాకీ ఉమ్మడిగా సంబంధించే విధంగా ఓ చక్కని తెలుగు వాక్యాన్ని చెప్పమన్నారట పింగళి నాగేంద్రరావుగారిని. దానికి

ప్రతిభ మీద ఆధారపడి వుంది. ప్రతిభ గనక

ప్రతి నిర్మాతా తాను ఎన్నుకున్న కథ మంచి

సినిమాల్లో 'జయాపజయాలు ' అనుకున్నప్పుడల్లా ఎప్పుడో చాలాకాలం క్రిందట క్రీ.శే పింగళి నాగేంద్రరావు గారు చెప్పిన సంఘటన గుర్తుకొస్తూ వుంటుంది.

ఒక నిర్మాత చిత్రం పూర్తి చేసిన తర్వాత 'ఎంబ్లెం'లో ఒక 'ఆర్చ్'లో రాయించడానికి 'సత్యమేవ జయతే, ధర్మమేవ జయతే ' అనే పద్ధతిలో దేవుడికీ, సినిమాకి ఉమ్మడిగా సంబంధించే విధంగా ఓ చక్కని తెలుగు వాక్యాన్ని చెప్పమన్నారట పింగళి నాగేంద్రరావుగారిని. దానికి ఆయన

"జయాపజయములు దైవాధీనములు" అని రాసుకోండి అని సలహా ఇచ్చారట.

అదే విధంగా 'జయాపజయాలు దైవాధీనాలు' అనేది అనాదిగా వస్తూన్న సూక్తి.

ఇన్నేళ్ళుగా పరిశ్రమలో వుంటూ ఎన్నో చిత్ర విచిత్రమైన సంఘటనల్ని చూశాను ఈ చిత్ర జయాపజయాల విషయంలో.

సాధారణంగా ప్రతి నిర్మాతా తన చిత్రం విజయవంతం కావాలనే నిర్మిస్తాడు తప్ప పరాజయం పొందాలని అనుకోడు. అయినా పరాజయాలు తప్పవు. ఒక్కోసారి విజయవంతం అవుతుందా లేదా అనే సందేహం కలిగిన చిత్రాలు విజయవంతమైనవీ వున్నాయి.

ఇదే విషయాన్ని ఓసారి కె.వి.రెడ్డిగారితో చర్చిస్తూ "అదృష్టం బాగుంటే చిత్రం విజయవంతం అవుతుంది. లేకపోతే పరాజయం పొందుతుంది అనే దృక్పథం ఒకటి వుంది. అలాగే 'విజయం సాధించడం అనేది ఆధారపడి వుంది. ప్రతిభ గనక లేకపోతే చిత్రం విజయవంతం కాదు' అనే దృక్పథం మరొకటి వుంది. మరి ఎందరో గొప్పవారు, ప్రతిభా సంపన్నులు, మహా మేధావులు అయిన రాజ్‌కపూర్, శాంతారాం వంటివారు ప్రతిభావంతంగా నిర్మించిన మంచి చిత్రాలు కూడా కొన్ని పరాజయాన్ని చూశాయి. ఏ ప్రత్యేకతా లేకుండా అతి సాధారణంగా నిర్మించిన చిత్రాలు విజయవంతమైనవి వున్నాయి. కారణం ఏమిటండీ?" అని అడిగాను.

అప్పటి రోజులకి ఆయనకున్న అనుభవంతో "ఒక నిర్మాతకు కథ అనేది ఒక అదృష్టం. దానిని తెరమీద చక్కగా చూపించడం ప్రతిభ. ఈ రెండూ కలిస్తేనే ఒక చిత్రం విజయవంతం అవుతుంది. ప్రతిభావంతంగా తెరమీద కెక్కించిన ఏ మంచి కథైనా తప్పకుండా విజయం సాధించి తీరుతుంది" అని సమాధానం చెప్పారు.

అయితే ఏది మంచి కథ ఎటువంటి కథ ఎటువంటి మంచి కథ అనిపించుకుంటుంది? ఇదీ మనకున్న సమస్య.

ప్రతి నిర్మాతా తాను ఎన్నుకున్న కథ మంచి కథేనని అనుకుంటాడు. అసలు అది మంచి కథ కాకపోతే ఆ నిర్మాత ఆ కథని ఎందుకు తీసుకుంటాడు? అయితే మనం ఎన్నుకునే కథల్లో అవి మంచివే కావచ్చు. కాని అందులో కొన్ని కృత్రిమమైన అంశాలు, అసహజంగా వుండేవి కొన్ని వుండవచ్చు. వాటిని మనం అంతగా పట్టించుకోకపోవచ్చు. లేక ఆ అంశాలను మనం పట్టుకోలేకనూపోవచ్చు. కొన్ని జానపద చిత్రాల్లో మనకి అసహజమైన అంశాలుగా తోచినవి కొన్నివున్నప్పటికీ, వాటిల్లో మానవతా విలువలు వున్న కారణంగా అవి మంచి కథా చిత్రాలుగా విజయాన్ని సాధించాయి.

అలాగే పౌరాణిక చిత్రాల విషయానికొస్తే 'లవకుశ', 'మాయాబజార్' నుంచి ఇవాళ్టి టి.వి రామాయణ్ వరకూ తీసుకుంటే, వాటి విజయానికి ఆ కథలో వుండే మానవత్వపు విలువలే కారణంగా నిలుస్తాయి.

ఈనాడు మనం చూస్తున్న కొన్ని సాంఘిక చిత్రాలు పేరుకి మాత్రమే సాంఘిక చిత్రాలుగాని, వాటిల్లో ఏ మాత్రం సామాజిక స్పృహ, మానవత్వపు విలువలు లేకుండా సహజత్వానికి అతి దూరంగా వుంటూ నాటి జానపదాలకన్నా తీసికట్టుగా వుంటున్నాయి.

ఎన్నో హంగులతో, ఎంతో ఖర్చుపెట్టి భారీగా తీసిన చిత్రమైనా సహజత్వానికి దూరంగా వుంటే అటువంటి చిత్రాలను ప్రజలు చూడడంలేదు.

చిత్రం నిర్మాణంలో వున్నప్పుడు అన్నీ చక్కగా వున్నట్టే మనకి అనిపిస్తుంది. ఆ చిత్రం విడుదలైన తర్వాతగాని ఆ చిత్రంలో వున్న లోపం, ఆ కథలో వున్న లోపం మనకు తెలియదు. ఒక్కోసారి ఏ లోపం లేని మంచి కథకు సరైన స్క్రీన్‌ప్లే, దర్శకత్వం లేకపోయినా, పాత్రకు తగిన పాత్రధారులను ఎంపిక చేసుకోలేకపోయినా ఆ కథ తెరపై రాణించదు అలాగే ఒక చెడ్డకథని ఎన్నుకుని, ఎంతటి ప్రతిభావంతులైన దర్శకులైనా, నటీనటులైనా, సాంకేతిక నిపుణులైనా వాళ్ళు ఎంత కష్టపడినా దాన్ని విజయవంతం చెయ్యలేరు.

అంచేత మంచి కథని తీసుకుని, సహజత్వానికి దగ్గరగా, పాత్రలకు తగ్గ నటీనటుల్ని (స్టార్ వేల్యూతో నిమిత్తం లేకుండా) ఎన్నుకుని, జనరంజకంగా దాన్ని తెరమీద చూపించడమే ప్రతిభ. ఈ రెండూ కలిసినప్పుడే ఏ చిత్రానికైనా విజయం లభిస్తుంది.

అయితే, చిత్రం విడుదల కాక పూర్వం, ఎవరు ఎన్ని విధాల ప్రశంసించినప్పటికీ, ఆ చిత్రం విడుదలానంతరం విజయం సాధించినా పరాజయం పొందినా ఎన్నో కారణాలు చెప్తారు. ఇది మానవ సహజం.

ఉదాహరణకి నా తొలి చిత్రం 'నీతి – నిజాయితీ'ని తీసుకుంటే, అది పరాజయం పొందిన చిత్రమే.

ఆ చిత్రంలో హీరో మూగవాడు. అది అంగవైకల్యానికి సంబంధించిన కథ. అంగవైకల్యం వున్నంత మాత్రాన ఏ మనిషీ పనికిరానివాడు కాదు. సమాజంలో అతనూ ఒక మనిషే. అతనికీ సంఘంలో ఒక విలువ వుంది అనే సందేశాన్ని అందించే చిత్రం. ఆ చిత్రాన్ని ప్రత్యేకమైన తరహాలో చిత్రీకరించాలని, కొత్తదనం చూపించాలన్న తపనతో పూర్తిగా కరుణరసానికే ప్రాధాన్యం చూపకుండా, అంతర్గతంగా విషాదం వున్నా, హాస్యరసాన్ని పైపూతగా చేసి ఒక ప్రయోగం చేశాను. ఆ చిత్రంలో హీరో పాత్రకు 'పాపులర్ హీరోని'ని ఎన్నుకుంటే వారు చేసేది 'నటన' అని ప్రేక్షకులు భావిస్తారని,

కొత్తదనం కోసం సహజత్వం కోసం 'సతీశ్ అరోరా' అనే యువకుడ్ని ఆ పాత్రలో పరిచయం చేశాం. పింగళి నాగేంద్రరావుగారు మంచి సంభాషణలు సమకూర్చారు. రాజేశ్వరరావుగారు మంచి సంగీతాన్ని ఇచ్చారు. ఇలా అన్ని హంగులతోనూ చిత్రాన్ని రూపొందించాను. అయినా అది విజయవంతం కాలేకపోయింది.

ఆ చిత్రం విడుదలకి ముందు ఓ ప్రముఖ పత్రికనుండి ఒక విలేఖరి వచ్చి 'మీ చిత్రం గురించి మీరేమనుకుంటున్నారు?' అని ప్రశ్నించారు. 'పబ్లిసిటీ'కి గాను నాలుగు మంచి మాటలు చెప్పమనే ఉద్దేశంతో.

దానికి సమాధానంగా నేను ఒక జాబితా వేసి 'చిత్రం విజయవంతమైతే జనం ఏమంటారు? పరాజయం పొందితే జనం ఏమంటారు?' అనేది రాసి ఇచ్చాను. విడుదలకి ముందు అలా ప్రచురించడం మంచిది కాదని దాన్ని పత్రిక వారే సదుద్దేశంతో ప్రచురించలేదు. నాకు మాత్రం ఎటువంటి అభ్యంతరమూ లేదు ఆ రోజుల్లోనే.

అందులో ఇలా రాశాను:

చిత్రం విజయవంతం అయితే జనం అనే మాట: "చూశారా అక్కడేముదండీ నవ్యత్వం ప్రతీ చిత్రంలోనూ హీరో పేరాల కొద్దీ డైలాగులు చెప్పేస్తాడు. మరి ఈ చిత్రంలో హీరోని మాటలు రాని మూగవాడిగా చూపించేసరికి జనం నావెల్టీగా ఫీలయ్యారు. అందుకే హిట్ అయింది.'

చిత్రం విజయవంతం కాలేదనుకోండి. అప్పుడు 'అసలు మాటలూ, పాటలూ, డాన్సులూ లేకుండా హీరోని, మూగవాడిగా చూపించడమేమిటండీ. ఈ కాలంలో 'హీరో' అంటే 'ఏక్షన్' వుండాలి. చురుకైన డైలాగులుండాలి. 'డ్యూయట్లు' పాడాలి. అవేమీ లేకపోతే పిక్చరేం ఆడుతుంది?' అని అంటారు.

సాధారణంగా ఆ రోజుల్లో ఏ చిత్రంలోనైనా హీరోని మూగవాడిగా చూపిస్తే ఎక్కడో అక్కడ ఏదో విధంగా చిత్రం మధ్యలో మాటలు వచ్చినట్టు చూపించేవారు. అలా కాకుండా 'నీతి – నిజాయితీ' చిత్రంలో మొదటి నుంచీ చివరివరకూ హీరోకి మాటలు రానేరావు.

చిత్రం హిట్ అయిందనుకోండి 'సాధారణంగా హీరో పాత్ర మూగదైతే జనం ఏమని అనుకుంటారు? మధ్యలో ఎక్కడో అక్కడ హీరో అకస్మాత్తుగా, అనుకోని విధంగా మాట్లాడతారనేగా. కాని ఈ చిత్రంలో హీరోకి ఎక్కడా మాటలు రావు. అదేనండీ 'నావెల్టీ ' అంటే అక్కడే జనాన్ని పట్టేసింది. అలా కాకుండా హీరోకి మధ్యలో మాటొచ్చినట్టు చూపించేస్తే మాత్రం రెండు వారాలకే లేచిపోయేది పిక్చర్' అని అంటారు.

అదే హిట్ కాలేదనుకోండి. 'ఏమైనా హీరో అన్న తర్వాత మధ్యలో మాటొచ్చినట్టు చూపించాల్సిందే. లేకపోతే మన జనానికి పట్టదు. ఏదో ఇంగ్లీషు సినిమాల్లో అంటే హీరోకి మాటలు రాకపోయినా చూస్తారు. మన తెలుగు సినిమాల్లో ఎవరు చూస్తారండీ' అని అంటారు.

ఇదే విధంగా ఏ చిత్రానికైనా విజయవంతం అయితే ఏయే అంశాలని చెప్పి ప్రశంసిస్తారో అపజయం పొందితే, అవే అంశాలను లోపాలుగా ఎత్తి చూపిస్తారు.

పైగా 'నేను ముందే చెప్పాను. కాని మీరు వినలేదు' అని దర్శకుడిని నిర్మాత, 'నేను వద్దంటే మీరే అలా కావాలని పెట్టించారు' అని నిర్మాతని దర్శకుడు లేదా హీరోగారేదో చెప్పారని, బావుందని ఆయన చెప్పినట్టు చేశాం. చివరికి ఇలాగైందని నిర్మాతకాని, దర్శకుడు కాని ఒకరిమీద ఒకరు నిందలు మోపుకుని, వాపోవడం కూడా సహజం. ఇది మానవ బలహీనతల్లో ఒకటి.

మరి, 'నీతి నిజాయితీ' చిత్రం తర్వాత ఎన్నో చిత్రాలకు దర్శకత్వం వహించిన అనంతరం రెండేళ్ళ క్రితం 'మయూరి' చిత్రానికి దర్శకత్వం వహించాను.

నిజానికి నా తొలి చిత్రం 'నీతి – నిజాయితీ' చిత్ర కథాంశం, 'మయూరి' చిత్ర కథాంశం రెండూ అంగవైకల్యానికి సంబంధించిన ఇతి వృత్తాలే. రెండింటి సందేశం ఒక్కటే, మరి ఆ చిత్రం ఎందుకు పరాజయం పొందింది? 'మయూరి' చిత్రం ఎలా 'హిట్ ' అయింది?

'నీతి – నిజాయితీ' విడుదలైన రోజుల్లో 'అంగవైకల్యం మీద చిత్రం నిర్మిస్తే అందులో వినోదం ఏముంటుంది? అందుకే ఆ చిత్రం పరాజయంపాలైంది' అని ఒక వ్యక్తి అన్నాడు. మరి 'మయూరి' చిత్రం విజయాన్ని సాధించింది. దీనికేమంటారు?

నా ఉద్దేశంలో ఆ చిత్రంలో కథలో ఎక్కడో లోపం వుంది. దర్శకుడిగా కొంత అనుభవం వచ్చిన తర్వాత, 'నీతి – నిజాయితీ' రోజులకన్న పరిపక్వ దశలోకొచ్చి అప్పట్లో బాగా చిత్రీకరించి వుండొచ్చు. చిత్రీకరణలో నా లోపం వల్ల ఆ చిత్రం పరాజయం పొందింది. ఆ తర్వాత 'మయూరి' బాగా తీశాను కనుక విజయవంతమైంది, అనుకుందాం.

ఆ చిత్రంలోనూ నటీనటులు బాగా చేశారు. ఈ చిత్రంలోనూ బాగా చేశారు. సంగీతం విషయంలోనూ ఇతర సాంకేతికపరమైన అంశాల్లోనూ రెండూ బాగున్నాయి. మరైతే లోపం ఎక్కడుంది?

అంటే ఆ రోజుల్లో కన్నా ఈ రోజుల్లో ప్రేక్షకులు చాలా 'అడ్వాన్స్' అయ్యారన్నమాట. ఆ రోజుల్లో వారు ఒక ఒరవడిలో వచ్చిన చిత్రాలను చూడడానికి అలవాటుపడిన కారణంగా, ప్రయోగాత్మకంగా నేను చూపించిన కొత్తదనాన్నివారు ఆహ్వానించలేకపోయారు.

నేడు టి.వి వచ్చింది. దూరదర్శన్‌లో 'నేషనల్ నెట్ వర్క్ 'లో మంచి మంచి సీరియల్స్ చూపిస్తున్నారు. జనం చూసి ఆనందిస్తున్నారు. ఎన్నో కొత్త కొత్త ఇతివృత్తాలతో, విభిన్నమైన చిత్రాలను చూడడానికి అలవాటుపడ్డారు. కథ ఎలాంటిదైనా కథనంలో నూతనత్వం, చిత్రీకరణలో నవ్యత్వం ఇలా ఎన్నో ప్రయోగాత్మకమైనటువంటి అంశాలను చూడడం ద్వారా కొత్తదనం కోసం ఎదురుచూచే స్థాయికి వారు ఎదిగారు. పూర్వంలోలా, అదే స్థాయిలో నిర్మించిన చిత్రాలనే చూస్తారు. అనే ధోరణి మారిపోయింది. చిత్రాలలో ఏదో ఒక కొత్తదనం, విభిన్నన ధోరణి వారికి కావాలి.

అయితే ఆ కొత్తదనం అనేది సహజత్వానికి దగ్గరగా , వారికి అర్ధమయ్యేరీతిలో, ఆహ్లాదకరంగా వుంటేనే చూస్తారు. లేకపోతే చూడడం లేదు.

నిజానికి, 'మయూరి ' చిత్రంలో సుధాచంద్రన్ నిగాకుండా మరే పాప్యులర్ 'హీరోయిన్'ని ఆ పాత్రకు ఎన్నుకున్నా, వారెంత కష్టపడి చేసినా సహజత్వం వచ్చి వుండేది కాదు. ఆ చిత్ర కథ సుధాచంద్రన్‌కి సంబంధించిన వాస్తవ కథ కావడం వల్ల, చిత్రంలో ఆ పాత్రను ఆమే ధరించడంవల్ల ప్రేక్షకులు వాస్తవికతను 'నీతి – నిజాయితీ' రోజుల్లోనూ చూపించాను. కాని, అప్పటి నా ప్రయత్నాన్ని వారు అభినందించలేకపోయారు. కారణం అటువంటి చిత్రాలపట్ల సరైన అవగాహన లేనందువల్లనే.

మనం తీసే చిత్రం వ్యాపార ప్రధానమైనదే అయినా, ఎంత 'మూస' ధోరణిలో తీస్తున్నప్పటికీ దర్శకుడుగాని, రచయితగాని, నటీనట్లుగాని, సాంకేతిక నిపుణులుగాని చిత్తశుద్దితో వారు చేస్తున్న పనిమీద మనసుని లగ్నంచేసి అందులో లీనమై, ఆనందాన్ని అనుభవిస్తూ తమ బాధ్యతలను సక్రమ్మగా నిర్వహిస్తే ఆ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందని నా నమ్మకం.

ఈ తాదాత్మ్యత అనేది ముందు ఆయా రంగాల్లో కృషి చేసే వాళ్ళలో పుట్టాలి. ఆ తర్వాత అది 'సెల్యులాయిడ్'లోకి వెళ్ళి, తద్వారా ప్రేక్షకుల్లోకి వెళ్తుంది. చేసే వాళ్ళలోనే తాదాత్మ్యత అనేది లేకపోతే సక్రమమైన పద్దతిలో 'సెల్యులాయిడ్' మీదికి వెళ్ళలేదు. అలా 'సెల్యులాయిడ్ ' మీదికి వెళ్ళకపోతే అది ప్రేక్షకులలోకి రాలేదు. దీన్నే మరో విధంగా చెప్పాలంటే 'ఆత్మ' అంటారు. ఎటువంటి చిత్రానికైనా 'ఆత్మ ' ఉండి తీరాలి.

'ఆత్మ' వుంటేనే చిత్రం విజయం సాధిస్తుంది.

ఇలా తీస్తే చాలు – జనం చూస్తారు అనే పద్ధతిలో యాంత్రిక ధోరణిలో, ఫార్ములా ప్రకారం డాన్సులు, ఫైట్లు పెట్టి, భారీ ఎత్తున ఖర్చుపెట్టి ఎన్ని హంగులు చొప్పించినా 'ఆత్మ' లోపించిన చిత్రాల్ని జనం చూడరు. అది విజయవంతంకాదు... కాలేదు.

COMMENTS